జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 26-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 379 పేజీలు: 4 వెల : రూ.7

# కూటమిపై.. వైసీపీ మరో పోరు



* 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరిట ఇంటింటా ప్రచారం * ఐదు వారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహణపై అధినేత దిశానిర్దేశం * సిక్కోలు వైసీపీ నేతలతో జగన్ సమీక్ష * హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు

**శ్రీకాకుళం, జూన్ 25 (వార్త):** కూటమి ప్రభుత్వంపై వైసీపీ మరోపోరుకు సిద్ధమైంది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం జరిగిన పార్టీ నేతల సమావేశంలో కార్యక్రమ కార్యాచరణను వైఎస్ జగన్ వివరించారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో-ఆర్డినేటర్లు హాజరయ్యారు.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన నేతలంతా హాజరయ్యారు. ఐదు వారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహణపై అధినేత దిశానిర్దేశం చేసి వారిలో ఉత్సాహం నింపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' అనే కార్యక్రమ విధివిధానాలను ప్రకటించారు వైఎస్ జగన్. ఈ కార్యక్రమం ద్వారా చంద్రబాబు నాయుడు హామీలను, వాటి వైఫల్యాలను ప్రజలకు వివరించనున్నట్లు వైఎస్ జగన్ తెలిపారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమాన్ని ఐదు వారాలపాటు నిర్వహించాలని వైసీపీ నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం వల్ల జరిగిన నష్టాన్ని, వైసీపీ ప్రభుత్వం ఉంటే లభించే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయనున్నారు. రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా చంద్రబాబు మేనిఫెస్టో హామీలు, సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ బాండ్ల వివరాలను ప్రజలకు చూపిస్తారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే, ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయిందో, గత ఏడాది ఎగ్గొట్టిన మొత్తం, ఈ ఏడాది రావాల్సిన మొత్తం వివరాలు అందుబాటులోకి వస్తాయి.

ఈ కార్యక్రమం నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలలో నాలుగు దశల్లో జరుగుతుంది, గ్రామ కమిటీలను కూడా ఇన్వాల్వ్ చేస్తారు. 'చంద్రబాబు ఎన్నికల హామీల రిబ్బన్ కూడా కట్ చేయకుండా, అన్నీ అమలు చేశామని చెబుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే నాలుక మందం అంటున్నారు' అని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో సంవత్సర కాలంలోనే ప్రజల్లో ఏర్పడిన తీవ్ర వ్యతిరేకతను దాచడానికి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగుతున్నారని ఆరోపించారు. ఈ ఐదు వారాల కార్యక్రమంలో గ్రామ స్థాయిలో కమిటీల ఏర్పాటును కూడా పూర్తి చేయాలని వైఎస్ జగన్ నాయకులను ఆదేశించారు. చంద్రబాబు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలతో ఇంటింటికీ బాండ్లు పంచారు, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటోలు, సంతకాలతో ప్రజలను ఆకర్షించారు. కానీ ఒక్క రూపాయి కూడా అమలు కాలేదు అని వైఎస్ జగన్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వివక్ష లేకుండా పథకాలు అమలు చేసిందని, కానీ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనతో అన్యాయాలు, అణిచివేతకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరించడమే ప్రధాన లక్ష్యంగా వైసీపీ పెట్టుకుందన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి  అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కంబాల జోగులు, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు.






శాస్త్రోక్తంగా జగన్నాథుని
## నేత్రోత్సవం

**ఇచ్ఛాపురం/శ్రీకాకుళం, జూన్ 25(వార్త):** జిల్లాలోని ఇచ్ఛాపురం, మందస, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, తదితర జగన్నాథ మందిరాల్లో బుధవారం జగన్నాథస్వామి  నేత్రోత్సవం, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. సుదర్శన, సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని భక్తులు కనులారా వీక్షించారు. ఇచ్ఛాపురంలోని పెద్ద జగన్నాథ స్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం విశేష హోమాలు, పూర్ణాహుతి, కళావాహన తదితర వైదిక కార్యక్రమాలను అర్చకులు ఎస్.పద్మకుమార్ ఆచార్యులు, పి.రామతేజ ఆచార్యులు, మూర్తి, ఎస్.రామకృష్ణాచార్యులు జరిపించారు. దిష్టి కుంభ దర్శనం, గోదర్శనం అనంతరం భక్తులకి దర్శనం కల్పించారు. తొలుత అద్దంలో స్వామిని వీక్షించి, అనంతరం నేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సామూహిక సహస్రనామ అర్చన, అలంకరణ, హారతి, మంత్రపుష్పాలు జరిపారు. మహిళలు లక్ష్మీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు. స్వామికి నివేదించిన అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ బెండి రామారావు, సేవాభక్తులు కాళ్ల శ్రీనివాసరావు, వల్లంపాటి నారాయణమూర్తి, ప్రకాష్ సాహు, కాదా రామకోటి, చిన్నారి మధు, వెంకటేష్, వల్లంపాటి శ్రీరామ్, పొట్ట వెంకటేష్ , ఉల్లిరాజు, వునా రమేష్ , కిల్లంశెట్టి హరికుమార్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఏవోబి కేంద్ర కమిటీ సభ్యులను
# కోర్టులో హాజరుపర్చండి

* బాతుపురంలో ప్రజా, పౌర, మానవహక్కుల సంఘాల ఆందోళన

**శ్రీకాకుళం క్రైం, జూన్ 25 (వార్త):** పోలీసుల అదుపులో ఉన్న బాతుపురం గ్రామానికి చెందిన ఏఓబి కేంద్ర కమిటీ సభ్యులు మెట్టూరు జోగారావు, చెల్లూరి నారాయణ అలియాస్ సురేష్‌లను తక్షణం కోర్టులో హాజరుపరచాలని కోరుతూ వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామంలో ప్రజా, పౌర, మానవ హక్కుల సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. టెక్ శంకర్, సురేష్‌తో పాటు మరో వ్యక్తిని ఇంటెలిజెన్స్ పోలీస్ అధికారులు,స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకూ అరెస్టు చూపించకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని వారు వాపోయారు. తక్షణం వారిని కోర్టులో హాజరుపర్చాలని పౌరహక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు. పోలీసుల తీరు తమకు అనుమానాలకు తావిస్తోందన్నారు. పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయెద్దంటూ ప్రభుత్వాన్ని కోరారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం
గురువారం 26 జూన్ 2025


## పలాస కిడ్నీ ఆసుపత్రి ఉద్యోగాల తాత్కాలిక జాబితా విడుదల

**పలాస, జూన్ 25(వార్త):** పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను బుధవారం విడుదల చేశారు. జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నియామకాలకు 289 దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా రూపొందించారని సూపరింటెండెంట్ డా.అల్లు పద్మజ తెలిపారు. రిసెప్షన్ క్లర్క్, డయాలసిస్ టెక్నీషియన్, సి–ఆర్మ్, జనరల్ డ్యూటీ, సెక్యూరిటీ వంటి పోస్టులకు ఈ ప్రక్రియ జరిగింది. జాబితాపై అభ్యర్థులకు అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గ్రీవెన్స్ దరఖాస్తుతో పాటు ఆసుపత్రికి సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.srikakulam.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

# పలాస కిడ్నీ ఆసుపత్రిలో వైద్యుల కొరత

**-శాశ్వత ప్రాతిపదికన నియమించాలి**

**-ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ**

**-పలాస కిడ్నీ ఆసుపత్రి పరిశీలన**



**పలాస, జూన్ 25(వార్త):** పలాస కిడ్నీ ఆసుపత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది, వైద్యులను శాశ్వత ప్రాతిపదికన నియమించి, సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రిని బుధవారం ఆయన, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక బృందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలకు నోచుకోలేదన్నారు. కేవలం 20 మాత్రమే డాక్టర్లు నియమిస్తే రోగులకు ఎలా సేవలు అందుతాయని ప్రశ్నించారు. 60 మంది నర్సులకు గాను 58 మంది కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నారని, శాశ్వత నర్సులను ప్రభుత్వం ఎందుకు నియమించలేదో చెప్పాలన్నారు. 8 మంది సిబ్బందితో రీసెర్చి పూర్తి స్థాయిలో జరగడం లేదన్నారు. 18 మంది టెక్నీషియన్లకు గాను కేవలం 10 మంది మాత్రమే ఉన్నారని, అది కూడా కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నారని చెప్పారు. నెఫ్రోప్లస్ అనే ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డయాలసిస్ కేంద్రంలో ప్రత్యేక నెఫ్రాలజిస్టు పూర్తిస్థాయిలో అందుబాటులో లేరన్నారు. 200 పడకల ఆసుపత్రిలో.. 100 పడకలు కూడా లేవన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఐదు, పది వేల రూపాయలు రోగులకు చెల్లిస్తామని చెప్పారే తప్ప సక్రమంగా అమలుకావడం లేదన్నారు. రోజు రోజుకు కిడ్నీ రోగుల సంఖ్య, మరణాల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని స్పెషలిస్టు సేవలు అందుబాటులోనికి తేవాలని, పేషెంట్లకు, అటెండెంట్లకు మూడు పూటలా ఆహారం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన రోడ్డు వద్ద పేషంట్లుకు వీలుగా బస్సు, ఆటోల కోసం వేచి ఉండడానికి బస్ షెల్టర్ నిర్మించాలని, ఎలక్ట్రిక్ వాహనం ఏర్పాటు చేయాలని కోరారు.

ఆయన వెంట ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి టి.కామేశ్వరరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు ధర్మారావు మాస్టారు, అజయ్‌కుమార్, రైతు సంఘం అధ్యక్షులు మోహనరావు, సీఐటీయూ నాయకులు గణపతి, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.



## నర్తు సీతారాంనకు పరామర్శ

**మందస, జూన్ 25(వార్త):** గొల్లలపాలేం గ్రామానికి చెందిన నర్తు సీతారాంను బత్తిని లక్ష్మణ్, సొర్ర ఢిల్లేశ్వరరావు పరామర్శించారు. ఉద్దానం విప్లవ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన సీతారాం పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో వారిద్దరూ ఆయనను కలసి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేసి , కొబ్బరి, జీడి పిక్కలు మద్దతు ధర, వంశధార నీటిని ఉద్దానం రైతులకు అందించాలని, జంతిబంద రిజర్వాయర్ కట్టించేలా ప్రభుత్వంతో చర్చలు జరపాలని వారికి సూచించారు. కార్గో ఎయిర్‌పోర్ట్‌కి వ్యతిరేకంగా మరింతగా ప్రజలను చైతన్యం చేసి ప్రజా ఉద్యమాలు చెయ్యాలన్నారు. ఆయన ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని లక్ష్మణ్, సొర్ర ఢిల్లేశ్వరరావు ఆకాంక్షించారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



**ఇచ్ఛాపురం, జూన్ 25(వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సత్తా చాటాలని పరిశీలకులు సాలీనా ఢిల్లీయాదవ్ కోరారు. పార్టీ క్లస్టర్ యూనిట్ బూత్ స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వజ్జ బాబూరావు, చౌదరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన భూముల ఆక్రమణ



**మందస, జూన్ 25(వార్త):** చీపి పంచాయతీ బెత్తుకోలలో గిరిజనుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గిరిజన ఐక్యవేదిక మండల అధ్యక్షుడు ఎస్.నీలకంఠం ఆరోపించారు. బుధవారం ఆయన ఆ గ్రామానికి వెళ్లి ఆ భూము లను పరిశీలించారు. కొంతమంది గిరిజనేతరులు ఆ భూములు మావి అని చెబుతూ యంత్రాలను తీసుకువచ్చి స్వాధీనపరచుకుంటున్నారన్నారు. సాగులో ఉన్న గిరిజ నులు అడ్డుకున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకుండా.. గిరిజనేతరులకు ఇక్కడ ఎలా పట్టాలు వచ్చాయని ప్రశ్నించారు. తక్షణమే సాగులో ఉన్న భూములను గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట గిరిజన రైతులు సవర గోపి, సవర లక్ష్మణ్, పెద్దశ్యామ్, సోప, చిన్న శ్యామ్, దుర్యోధన, హీరంబదర్, టోంకాధర్, లావణ్య, బాసు, భగిరదీ, బుడ్డు, దేవ, విశ్వనాథ్, భీమారావు, బాలు, సుదామణి, జగన్, శుశాంత్, తిరుపతి, ఎండ తదితరులు ఉన్నారు.

# వీఆర్‌ఏల ధర్నా




**శ్రీకాకుళం, జూన్ 25(వార్త):** నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, పే స్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరుతూ వీఆర్‌ఏలు జిల్లా కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీ అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని వీఆర్‌ఏ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అను సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి మాట్లాడుతూ పార్ట్ టైం పేరుతో ఫుల్ టైం సేవలను ప్రభుత్వము ఉపయోగించుకున్నప్పటికీ వీఆర్‌ఏలను ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించడం లేదని, కనీస వేతనం అమలు చేయడం లేదని వాపోయారు. 15 ఏళ్లుగా నామినీ ఏరియల్‌గా పనిచేస్తున్న వారిని సేవలను చేయించుకున్నప్పటికీ వీఆర్‌ఏలుగా గుర్తించకుండా ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. వీరిని వెంటనే వీఆర్‌ఏలుగా గుర్తించాలని, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలని, వీఆర్వో , అటెండర్, వాచ్‌మన్, డ్రైవర్ మొదలగు ఖాళీల్లో ప్రమోషన్లు 70% వీఆర్‌ఏలకే కేటాయించాలని, చట్ట విరుద్ధంగా చేయిస్తున్న నైట్ డ్యూటీలను ఆపాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కె.అప్పారావు, బి.రాములమ్మ, ఎన్.సీతప్పడు, జి.రామ్మూర్తి, లక్ష్మణరావు, జనార్దనరావు, బి.అప్పారావు, మీనాక్షి, రాజులమ్మ, పద్మ, ఎం.రాము, లోకనాథం, ఈశ్వరరావు, పోతయ్య, దాలప్పుడు తదితరులు పాల్గొన్నారు.

## కేసుపురంలో పొలం పిలుస్తోంది



**ఇచ్ఛాపురం, జూన్ 25(వార్త):** కేసుపురం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది బుధవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు బాకీ స్నేహ రెడ్డి, దక్కత ఢిల్లీరావు, డి.కామేశ్వరరావు, టొంక రావు, పి.వాసు, ఎన్.హరికృష్ణ, పి.గణపతి, పిట్టదొంబురు నూకరాజు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## నిస్వార్థ దేశభక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ

**మందస, జూన్ 25(వార్త):** నిస్వార్థ దేశభక్తుడు డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని భారతీయ జనతా పార్టీ నేత పొందర దుదిష్టి పాత్రో అన్నారు. మందసలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత సమగ్రతల కోసం ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశభక్తుడు జనసంగ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు. ఆయన బాటలో నేటి తరం పయనించాలని వారు కోరారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రట్టి లక్ష్మణ్‌కుమార్, హడ్డి గౌడ్, సవర జాదవ్ పాల్గొన్నారు.



## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి బదిలీలు చేపట్టండి



**మెళియాపుట్టి, జూన్ 25(వార్త):** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, బదిలీల ప్రక్రియ చేపట్టాలని వారు కోరారు. జి.ఓ. నెం.5 తో సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల, మునిసిపాలిటీలకు బదిలీలు చేయరాదన్న నేపథ్యంలో చాలా ఇబ్బందిగా మారిందని, ఈ జి.ఓ. పునః పరిశీలించి సొంత మండలాలు, మునిసిపాలిటీలలో పోస్టింగ్స్ ఇచ్చే విధముగా మార్పు చేయాలని విన్నవించారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తరువాతనే బదిలీలు చేపట్టాలని, మిగులు ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారో స్పష్టత ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సచివాలయ ఉద్యోగులందరికి ప్రమోషన్ చానల్ కల్పించి రేషనలైజేసన్ ప్రక్రియ చేపట్టాలని, జాయినింగ్ తేదీ నుండి సర్వీసును పరిగణనలోకి తీసుకొని రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఆలస్యంగా ప్రొబేషన్ ప్రకటించినందుకు 9 నెలలు కాలానికి గాను ఏరియర్స్ మంజూరు చేయాలని, వెబ్ కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు ప్రక్రియ పారదర్శకంగా జరపాలని, సచివాలయ ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపు, అర్హులైన వారికి ప్రమోషన్లు వంటి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని వివిధ డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండాకు అందించారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది శరత్ కుమార్ రెడ్డి, రాజారావు మోహన్ కృష్ణ, ద్రోణాచార్యులు, ప్రణీత్ కుమార్, సుజాత, దమయంతి, దుర్గారావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శ్రీకాకుళంలో రేపు ఉద్యోగ మేళా

**శ్రీకాకుళం, జూన్ 25(వార్త):** శ్రీకాకుళంలోని ఈ నెల 27న నెహ్రూ యువ కేంద్రంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ బుధవారం తెలిపారు. వరుణ్ మోటార్స్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్లు ఉద్యోగానికి ఏదైనా డిగ్రీ ఉండి, 21 నుంచి 35 ఏళ్లు కలిగి ఉండాలన్నారు. 25 ఖాళీలు ఉన్నాయని, పురుషులు మాత్రమే అర్హులని, నెలకు జీతం రూ.16,500లు ఉంటుందని, ఇన్సెంటివ్, 2 వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. శ్రీకాకుళం, పలాస, సోంపేట, టెక్కలి, రాజాం, పాతపట్నం, పాలకొండ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతలు/ఉద్యోగ అనుభవ వివరములను WWW.NCS.GOV.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 10 గంటలకు నెహ్రూ యువ కేంద్రం, ఆర్టీసీ కాంప్లెక్స్ బ్యాక్ సైడ్, శ్రీకాకుళం వద్దకు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్ తీసుకొని హాజరు కావాలని సూచించారు.



## పెరటి పంటల పెంపకం లాభదాయకం

**మందస, జూన్ 25(వార్త):** పెరటి పంటలు పెంపకం లాభదాయకమని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మహిళలకు 11 రకాల విత్తనాలు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూర్మారావు మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాలలో ప్రతి ఒక్కరూ పెరటిలో ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబిస్తు, కిచెన్ గార్డెన్ పంటలు పండించాలన్నారు. దీంతో ఆరోగ్యంతో పాటు మార్కెట్లో వినియోగదారులకు ధరల మంటలు అదుపులో ఉంటాయన్నారు. వీటిని అందరూ చక్కగా వినియోగించుకొని ఆరోగ్యంతో పాటు అధిక ధరలను నియంత్రించగలగాలని కోరారు. కార్యక్రమంలో మండల స్థాయి సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

## మహిళలకు ఆపదలో అండగా శక్తి యాప్




**శ్రీకాకుళం, జూన్ 25(వార్త):** ఆపద వేళలో శక్తి యాప్‌తోనే మహిళలు, విద్యార్థులకు భద్రత, రక్షణ లభిస్తుందని ప్రతి ఒక్క మహిళ, విద్యార్థులు ఫోన్ లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీమ్ సభ్యులు కోరారు. బుధవారం వారు శక్తి యాప్ ప్రాధాన్యత, ఆవశ్యకతపై వారు పాఠశాలలు, కళాశాలలు, పబ్లిక్ ప్రదేశాలలో మహిళలకు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. డయల్ 112, ఎస్‌వోఎస్ బటన్ ఆపద సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు.

## ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కారం



**శ్రీకాకుళం, జూన్ 25(వార్త):** ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం ఆయన విశాఖ ఏ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని తెలిపారు.

## ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

**మెళియాపుట్టి, జూన్ 25(వార్త):** విద్యార్థులు ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు దేవేంద్రరావు, పద్మనాభం అన్నారు. జిల్లాపరిషత్ పాఠశాలలోని భవిత కేంద్రాన్ని బుధవారం వారు సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న విద్యార్థులకు ఫిజియోథెరఫీ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీకి సంబంధించి వివిధ అంశాలను విద్యార్థులకు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి నిర్మూలనకు స్పష్టమైన ప్రణాళిక

**-డీఐజీ గోపీనాథ్ జట్టి**

**శ్రీకాకుళం, జూన్ 25(వార్త):** గంజాయి నిర్మూలనకు స్పష్టమైన ప్రణాళిక అమలు చేస్తున్నామని విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్‌జట్టి తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, వినియోగం, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు, డీ–అడిక్షన్ తదితర అంశాలను వివరించారు. గంజాయి సాగు నిర్మూలనకు ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. ఈ ఏడాదిలో గంజాయి అక్రమ రవాణా పై 694 కేసులు నమోదు చేసి, 40,063 కిలోల గంజాయి, 18 కిలోల హసిష్ ఆయిల్ స్వాధీన పరుచుకుని, 478 వాహనాలను జప్తు చేసి, 1945 ముద్దాయిలను అరెస్ట్ చేశామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టుటకు గాను 26 స్టాటిక్ చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసి, వాటికి సీసీ టీవీలను అమర్చామన్నారు. వీటికి అదనంగా 289 డైనమిక్ చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. అక్రమ గంజాయి రవాణా వ్యాపారం చేసే ఎనిమిది మందికి చెందిన రూ.9,76,84,724ల ఆస్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాదిలో 23 కేసులలో 40 మంది ముద్దాయిలకు కోర్టులు శిక్షలు విధించాయన్నారు. ఈ ఏడాది కాలములో 10,654 అవగాహనా సదస్సులు నిర్వహించి, 3039 విద్యా సంస్థలను, గ్రామాలను భాగస్వామ్యం చేశామన్నారు. ఇప్పటివరకు 51 మంది గంజాయి వినియోగదార్లపై కేసులు నమోదు చేసి, 161 మంది గంజాయి వినియోగదార్లను పునరావాస కేంద్రాలకు చికిత్స నిమిత్తం తరలించామని తెలిపారు. సమగ్ర దర్యాప్తుకు పోలీస్ అధికార్లకు ఎప్పటికప్పుడు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువతను రక్షించేందుకు, సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు మనందరం కలసి పనిచేయాలని డీఐజీ పిలుపునిచ్చారు.




# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



**ఇచ్ఛాపురం, జూన్ 25(వార్త):** అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరావు ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసి యేషన్ సమావేశం ఏర్పాటు చేశారు. స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయ ఆవరణలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు జైసింహ మహిళా కార్యదర్శి పుక్కల్ల అరేలమ్మ హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హైపవర్ కమిటీ వేసి ఆస్తులను కాపాడి వేగవంతంగా ప్రక్రియ జరిపిస్తుండడంతో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధితులందరికీ త్వరగా న్యాయం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితులంతా ఏకతాటిగా మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీలను బలపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నల్ల ప్రసాదు, పి.అర్జున్, విద్యాధర బెహరా, నారా యణ బాడిత్య, రోజా తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాల మాస్టర్ ఓంకార్‌కు ఘన నివాళి



**పలాస, జూన్ 25(వార్త):** ఉపాధ్యాయ వృత్తిలో పని చేస్తూ అనేక ప్రజా సంఘాల నిర్మాణంలో ఓంకార్ మాస్టర్ కీలకపాత్ర పోషించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాకన్నపల్లిలో బుధవారం సూర్యోదయ యువజన సంఘం, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఓంకార్ మాస్టర్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. మాస్టర్ చిత్రపటానికి ఆయన సతీమణి సరస్వతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏపీ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ అధ్యక్షతన సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాల్లోనే కాకుండా ఉద్దాన ప్రాంతంలో పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధి సమస్య, జీడి గిట్టుబాటు ధర కల్పించాలని రైతాంగం తరఫున పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎన్ గణపతి, సర్పంచ్ సైని దేశయ్య, యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గేదెల దిలీప్‌కుమార్, గార ఉదయ్‌కిరణ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచరాన రమేష్, బద్రి కూర్మారావు, కుత్తుం ప్రకాశరావు, బొమ్మాళి శివకుమార్, పోతనపల్లి గీతమ్మ, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, మద్దిల రామారావు, పోతనపల్లి కుసుమ, తామడ రామారావు, కుత్తుం వినోద్ కుమార్, తెప్పల వాసు, శశిధర వర్మ, పోతనపల్లి బాలరాజు, తెప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.



## జగన్నాథ రథయాత్రకు సన్నాహాలు

**పలాస, జూన్ 25, (వార్త):** పలాస మండలం తరాకోట గ్రామంలో ఈ నెల 27న జరగనున్న గుండిచా రదయాత్రకు సన్నాహాలు పూర్తయ్యాయి. రాజుల కాలం నుంచి పురాతన జగన్నాథ ఆలయం ఆవరణలో యాత్ర జరుగుతోంది. ఆలయం ఆవరణలో రథంను సిద్ధం చేశారు. కాగా గత 12రోజులుగా స్వామివారు అస్వస్థతకు గురై గదికే పరిమితమై భక్తులకు దర్శనం ఇవ్వలేదు. గురువారం స్వామివారికి ప్రత్యేక హజలు జరిపిన అనంతరం ఆ భక్తులకు దర్శనార్థం శుక్రవారం జరుగనున్న రథయాత్రకు సిద్ధమవుతారని అర్చకులు తెలిపారు.

# శక్తి యాప్ బాలికలకు రక్షణ కవచం

### * సీఐ సూర్యనారాయణ * శ్రీచైతన్యలో అవగాహన

**పలాస, జూన్ 25, (వార్త):** శక్తి యాప్ బాలికలకు రక్షణ కవచమని కాశీబుగ్గ సీఐ పి సూర్యనారాయణ అన్నారు. పలాస చైతన్య జూనియర్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా ఉన్నప్పుడు శక్తి యాప్ తోడుగా ఉంటుందని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఉన్న శక్తి టీంకు ఫోన్‌తో సమాచారం ఇస్తే వెంటనే సహాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం ఎస్సై రవి, శ్రీ చైతన్య కాలేజ్ ఏవో రామరాజు, బడె యాదవ రావు, వైస్ ప్రిన్సిపాల్ బి మహేశ్వరరావు, వై లీలారావు, ఇంచార్జ్‌లు రత్నాల సంధ్య, ధనుంజయ పాత్రో, శక్తి టీం సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయండి

**ఇచ్ఛాపురం, జూన్ 25(వార్త):** ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1100 మంది విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేరని, తరగతుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సుమారు 16 మంది ఉపాధ్యాయులు నియమించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.విజయరామరాజుని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు.

డైరెక్టర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ భరత్ నారాయణ గుప్తాని కలిసి, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రాంగణం వాస్తవిక ఏరియా సర్వే చేయించి, చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి పరిరక్షించాలని కోరారు.

# అడుగుకో గొయ్యి..!

**-అధ్వానంగా ఎర్రముక్కాం-రాణిగాం బీటీ రోడ్డు**

**-తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు**

**మందస, జూన్ 25(వార్త):** మందస మండలానికి ఆనించి ఉన్న ఉద్దానం గ్రామాలను కలుపుతున్న రహదారి అధ్వానంగా ఉంది. సుమారు 16గ్రామాలను ఏకైక దిక్కుగా ఉన్న ఈ రహదారి దారుణంగా ఉంది. మందస మండలం పక్కనే సోంపేట





మండలంలో ఉన్న ఎర్రముక్కాం-రాణిగాం రోడ్డు పరిస్థితి చూస్తే, ఎవరికైనా భయం వేస్తుంది. రాణిగాం నుంచి ఎర్రముక్కాం వెళ్లే నాలుగు కిలోమీటర్ల రోడ్డులో ప్రతి 100మీటర్లకు సుమారు 60 గోతులు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కళాశాలలకు వెళ్లే మత్స్యకార విద్యార్థులు, చిన్న చిన్న వ్యాపారస్తులు, వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణమంటే హడాలిపోతున్నారు. ఆటో డ్రైవర్లు, యజమానులు తమ వాహనాల మన్నిక తగ్గిపోయి, నష్టాలతో కుటుంబాలుకు భారంగా మారిందంటున్నారు. రోడ్డు సమస్యపై విషయం పెద్దలు, అధికారులను విన్నవించుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ ఈ ప్రభుత్వంలోనైనా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఆమదాలవలస, జూన్ 25(వార్త):** ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అనారోగ్యం బారినపడి కష్టాల్లో ఉన్న పలు కుటుంబాలకి సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల బుధవారం పంపిణీ చేశారు. మెట్ల గీతాకుమారికి రూ.70వేలు, సింహాద్రి అరుణకుమారికి రూ.2.60లక్షలు, బగాది భాస్కర్‌చంద్రకు రూ.1.21లక్షలు, అన్నెపు సురేష్‌బాబుకు రూ.67వేలు, బొర్రా యమునావతికి రూ.1,02లక్షలు, పెద్ది మాలతీభాయ్‌కు రూ.63 వేలు అందించారు.

## జాడుపూడి, బారువల్లో ట్రైన్ హాల్టులు కల్పించండి



**ఇచ్ఛాపురం, జూన్ 25(వార్త):** జాడుపూడి, బారువా స్టేషన్లలో బరంపురం-విశాఖపట్నం, భువనేశ్వర్ -పలాస ట్రైన్‌లకు హాల్ట్ కల్పించాలని డీఆర్‌యూసీసీ సభ్యులు కట్టా సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ సీవీ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో దేవరపల్లి గోపాలరావు, పి.ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు చిత్రపటానికి తల్లుల పాలాభిషేకం

**పలాస, జూన్ 25(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం వెలుగు కార్యాలయం పరిధిలోగల తల్లులుందరూ చేరి ముఖ్యమంత్రి చంద్రబాబు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషమ్మ చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం జి.ప్రసాదరావు, మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, క్లస్టర్ కన్వీనర్ అరసవెల్లి ఉమామహేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కోడా సరస్వతి, మండల రైతు సహకార సమాఖ్య కార్యదర్శి బత్తిని హేమ, సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు



**కొత్తూరు, జూన్ 25(వార్త):** అడ్డంగి గ్రామంలో ఆదివాసీల అభ్యున్నతి లక్ష్యంగా పీఎం జనమత్ ఉత్సవాలు, బీర్సా ముండా జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసారావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పరిసర ప్రాంత గిరిజనులు పాల్గున్నారు.

## మందస వైద్యాధికారి సంపత్‌రావుకు బదిలీ



**మందస, జూన్ 25(వార్త):** మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావుకు బదిలీ అయ్యింది. ఈయన కొవిడ్ సమయంలో ఎంతో సాహసంతో సేవలందించారు. సంపత్‌రావు అందించిన సేవలకు ఐటీడీఏ సీతంపేట ప్రాజెక్టు నుంచి ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు అందుకున్నారు. డాక్టర్ సంపత్ రావుకు వెంకటాపురం పీహెచ్సీకి బదిలీ కాగా, ఆయనకు పీహెచ్సీ సిబ్బంది వీడ్కోలు పలికారు.

# అర్బన్ హెల్త్ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**పలాస, జూన్ 25(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో నిర్మిస్తున్న, పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటర్లను త్వరలోనే ప్రారంభించి, వైద్య సదుపాయాలని ప్రజలకు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. బుధవారం ఆయన ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. మొగిలిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.




## పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి

**పలాస, జూన్ 25(వార్త):** పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బ్రాహ్మణతర్లా సర్పంచ్ బాడన పుష్ప కోరారు. బుధవారం ఆమె గ్రామంలోని పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలో ఉన్న చెత్తను పొక్లైనర్, ట్రాక్టర్లతో తొలగింపజేశారు. వీధి దీపాలు వేయించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సుబాష్ ( బోస్), పొందర శ్రీను, సల్ల కామరాజు, పొట్నూరు మురళి, కార్యదర్శి శ్రీనివాస్, ఇంజనీర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546